## క్లుప్తంగా

### సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

**జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి**



చెక్కు అందజేస్తున్న జంగారెడ్డి తదితరులు

**కందుకూరు:** సంక్షేమ పథకాలతో పేదలకు మేలు చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలో సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ సర్పంచ్ మంద సాయిలు, బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ఎ.పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**హుడాకాంప్లెక్స్:** మరమ్మతుల కారణంగా 11కేవీ జేబీ కాలనీ ఫీడర్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేబీ కాలనీ, డాక్టర్స్‌కాలనీ, క్రాంతినగర్, సాయికృష్ణా నగర్, పరిసర కాలనీల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

### ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**తుక్కుగూడ:** మున్సిపాలిటీ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ తల్లి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతియైన మంగళవారం కావడంతో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

### పార్టీ కార్యకర్తలు నా కుటుంబ సభ్యులు

**మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి**

**మహేశ్వరం:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగారం గ్రామం మైలార్‌బాయి తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బిచ్చ నాయక్‌ను మంగళవారం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు తన కుటుంబసభ్యులన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎవరికి అపదవచ్చినా అండగా ఉంటూ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దశరథ నాయక్, అల్లె కుమార్, సేవ్యా నాయక్, వత్తుల నారాయణ, ఘాస్సీరామ్, రాజు నాయక్, శివ, అల్లె రాకేష్, రాజు, ప్రవీణ్, జంగయ్య, రమేశ్, విజయ్, గోపి, రాజు, హరికృష్ణ, సంగారెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

### సీజ్ చేసిన వాహనాల తరలింపు




వాహనాలను తొలగించిన దృశ్యం

**వనస్థలిపురం:** వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వెనకవైపు రోడ్డుకు ఇరువైపులా సీజ్ చేసిన వాహనాలను పార్కింగ్ చేసిన పోలీసులు ఎట్టకేలకు వాటిని అక్కడినుంచి తరలించారు. సీజ్ చేసిన వాహనాలను ఏళ్ల తరబడి పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డుపై నిలిపి ఉంచడంతో కాలనీవాసులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత మార్చిలో కాలనీవాసుల కోరిక మేరకు ఆ ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఏసీపీ పురుషోత్తంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలతో మాట్లాడి వాహనాలను అక్కడినుంచి తొలగించాలని సూచించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కలెక్టర్‌తో చర్చించి తట్టి అన్నారంలో స్థలాన్ని కేటాయించడంతో పోలీసులు వాహనాలను అక్కడికి తరలించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఏడాదైనా వెలగట్లే..

వీధి దీపాల నిర్వహణ గాడి తప్పింది. ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. అంధకారంలో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు.

- అలంకారప్రాయంగా వీధి దీపాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



అంధకారంలో కందుకూరు ప్రధాన చౌరస్తా

**కందుకూరు:** జాతీయ రహదారిపై వీధి దీపాలు ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా ఇంత వరకు వాటిని ప్రారంభించనే లేదు. దీంతో నిత్యం చీకట్ల మధ్యనే వ్యాపారాలు కొనసాగుతున్నాయి. మరో పక్క ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. సమస్య పరిష్కరించాలని స్వయంగా మంత్రి ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇది మండల కేంద్రంలోని శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై దుస్థితి.

**రూ.4.92 కోట్ల ఖర్చుతో ఏర్పాటు**

శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు, విఠాయిపల్లి, వెల్దండ, కల్వకుర్తి, డిండి తదితర ప్రాంతాల్లోని ప్రధాన చౌరస్తాల్లో 8 చోట్ల రూ.4.92 కోట్ల నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రారంభించినా.. కందుకూరు చౌరస్తాలో ఇంత వరకు ప్రారంభించనే లేదు. ప్రధాన చౌరస్తా కావడంతో నిత్యం ఆ ప్రాంతంలో జన సంచారం అధికంగా ఉంటుంది. రోడ్డు కిరువైపులా వ్యాపార సముదాయం ఉండటంతో అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులతో పాటు ప్రయాణికులకు రోడ్డుపై రాత్రి వేళ చీకటి కారణంగా తిప్పలు తప్పడంలేదు. దుకాణాల్లోని లైట్ల వెలుగులోనే నెట్టుకొస్తున్నారు. కనెక్షన్ ఇవ్వడానికి మాత్రం అధికారులు మొగ్గు చూపడంలేదు. ఏదైనా ప్రజలకు ఉపయోగపడే పనులు పూర్తి చేసిన వెంటనే ప్రారంభిస్తే అటు అధికారులకు ఇటు ప్రజాప్రతినిధులకు మన్ననలు అందుతాయి. ఇక్కడ మాత్రం అలా లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

**విద్యుత్ శాఖ కొర్రీతో..**

కందుకూరు నుంచి డిండి వరకు శ్రీశైలం రహదారిపై మధ్యలో ఉన్న ప్రాంతాల్లో వీధి దీపాలకు కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సంబంధిత శాఖ పేరుతో రూ.28 లక్షలు డీడీ తీసి ఎస్‌ఈ కార్యాలయంలో అందజేశాం. ఇప్పుడు విద్యుత్ శాఖ అధికారులు ఆ డీడీలు చెల్లవు, మళ్లీ తిరిగి డీడీలు తీసి పంపాలని కొర్రీలు పెడుతున్నారు. అన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు సైతం ఏర్పాటు చేశాం. ప్రారంభించడం మాత్రమే మిగిలి ఉంది. కందుకూరు, డిండి ప్రాంతాల్లో మినహా మిగతా చోట్ల వీధి దీపాలు ప్రస్తుతం వెలుగుతున్నాయి. ఇక్కడ విద్యుత్ అధికారులు అంగీకరించాల్సి ఉంది. – **గంగాధర్‌రావు, ఇంజనీర్, నేషనల్ హైవే**

# పాఠశాలల సమస్యలపై మంత్రికి లేఖ

**హుడాకాంప్లెక్స్:** ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం విద్యాశాఖా మంత్రి సబితారెడ్డికి లేఖ రాశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంలో పాఠశాలను సందర్శించగా సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. కిటికీలు, తలుపులు లేవని, బెంచీలు, డిజిటల్ బోర్డులు, కంప్యూటర్ ఆధారిత విద్యకు దూరంగా ఉన్నారన్నారు. తాగునీరు, టాయిలెట్స్ నిర్వహణ, ఉపాధ్యాయులు, స్కావెంజర్‌ల కొరత తీవ్రంగా ఉందన్నారు. డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని లేఖలో కోరామన్నారు.

# పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్

**కమిషనర్ నాగేశ్వర్**

**మీర్‌పేట:** కార్పొరేషన్ పరిధిలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని మీర్‌పేట కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు. మంగళవారం ఉదయం కార్పొరేషన్ పరిధి కమలానెహ్రూనగర్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీల్లో కమిషనర్ పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రోజు కాలనీలు, బస్తీల్లో పర్యటించి ఎక్కడ ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చెత్తను రోజువారీగా తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే విధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం.



పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ నాగేశ్వర్

# ప్రజా సేవలో పారిశుద్ధ్య కార్మికులు

**కార్పొరేటర్ సురేఖ**

**మీర్‌పేట:** పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ప్రజల సేవలోనే ఉంటారని మీర్‌పేట కార్పొరేషన్ 39వ డివిజన్ కార్పొరేటర్ మాధురి సురేఖ న్నారు. దశాబ్ది ఉత్సవాల్లో మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె మహిళా పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. కమలానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడారు. ప్రధాన రహదారులు, కాలనీలు, బస్తీలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి నిత్యం పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తుంటారన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సిహెచ్.నాగేశ్వర్, యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ భవ్య, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానిస్తున్న కార్పొరేటర్

# దశాబ్ది ఉత్సవాల్లో ఉత్తమ అవార్డులు



అవార్డు అందజేస్తున్న రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ వరప్రసాద్



అవార్డు అందుకుంటున్న సంగీత

**మహేశ్వరం:** దశాబ్ది ఉత్సవాల్లో మహిళా సంక్షేమ దినోత్సవం సందర్భంగా మంగళవారం సహకార సంఘం కార్యాలయంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు అందించారు. మహేశ్వరం మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మరమోని కవితకు జిల్లా ఉత్తమ మహిళా సమాఖ్య కార్యదర్శి అవార్డు వరించింది. డీఆర్‌డీఏ, సెర్ప్ ద్వారా నిర్వహించిన కార్యక్రమాలకు గాను ఈ అవార్డు అందజేసినట్లు రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ వి.రాజవరప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. అవార్డు వచ్చేందుకు సహకరించిన సెర్ప్ సీఈఓ సందీప్ కుమార్ సుల్తానీయా, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్, డీపీఎం స్వర్ణలత, ఏపీఎం సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

**నియోజకవర్గ ఉత్తమ వీఓఏగా సంగీత**

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో చిన్నతూప్రకు చెందిన ఆకుల సంగీత నియోజకవర్గ ఉత్తమ వీఓఏగా అవార్డు అందుకున్నారు. మంగళవారం జల్‌పల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సంగీత మాట్లాడుతూ.. అవార్డు వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్ జైన్, మహిళా, శిశు సంక్షేమ శాఖ, డీఆర్‌డీఏ పీడీ ప్రభాకర్, మండల ఏపీఎం సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా దశాబ్ది ఉత్సవాలు




విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

**బడంగ్‌పేట్:** సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మంత్రి సబితారెడ్డి, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, సినీ నటులు ప్రియదర్శి, ఫరియ అబ్దుల్లా, రాచకొండ కమిషనర్ డీఎస్.చౌహాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమెన్ సేఫ్టీ, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన మౌంట్‌కార్మెల్ గ్లోబల్ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుప్రభ హనీ, పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రైనేజీ మరమ్మతులు వేగంగా చేపట్టండి

**హుడాకాంప్లెక్స్:** సరూర్‌నగర్ డివిజన్ పరిధి కృష్ణానగర్ కాలనీలో చేపట్టిన డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ నాయకుడు లోకసాని కొండల్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన కృష్ణానగర్ కాలనీలో పర్యటించారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి రోడ్డుమీదకు వస్తుండటంతో కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సమస్యను మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌని శ్రీనివాస్‌గౌడ్, రాగం సునీల్ యాదవ్, కడారి రాజు యాదవ్, ఫయాజ్, గుప్రాన్ కాలనీ అధ్యక్షుడు రాజశేఖర్, కృష్ణచారి, అనంతయ్య, శ్యాం తదితరులున్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న నాయకులు

# ధరణి సమస్యలను పరిష్కరించండి

**డీటీకి యువజన కాంగ్రెస్ నేతల వినతి**

**మంచాల:** రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోర చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంచాల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారెడ్డికి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ధరణిలో టీఎం–33 అప్లికేషన్లు వేలాదిగా వచ్చాయన్నారు. 2022 నుంచి ఇప్పటివరకు వచ్చిన అప్లికేషన్లన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపారు. తక్షణమే వాటిని పరిష్కరించాలన్నారు. ధరణిలో నెలకొన్న లోపాల కారణంగా రైతులు అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ప్లాట్లు క్యాన్సల్ చేసుకున్న రైతులకు సంవత్సరం నుంచి ఇంకా డబ్బులు తిరిగి ఇవ్వడం లేదన్నారు. అదే విధంగా మోటేషన్లు పెట్టుకున్న వారికి కూడా సకాలంలో సమస్య పరిష్కారం చేయడం లేదన్నారు. ప్రభుత్వం ధరణిలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల నాయకులు క్రాంతి, శ్రీకాంత్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

### రసవత్తరంగా సంక్షేమ సంఘం ఎన్నికలు

**వనస్థలిపురం:** వనస్థలిపురం నివాసితుల సంక్షేమ సంఘం ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. గత కమిటీ కాలపరిమితి ముగియడంతో నూతన కమిటీ ఎన్నికకు కాలనీ సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. కాలనీవాసులు రెండు గ్రూపులుగా విడిపోవడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ ఆఫీసర్‌గా మహదేవ్ కొంకతి, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా సిద్దుల జ్ఞానేశ్వర్, అడ్వైజర్ అండ్ కన్వీనర్‌గా కొలిశెట్టి లక్ష్మయ్య నియమిలయ్యారు. కాగా ఈ నెల 25 వరకు మెంబర్‌షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ లక్ష్మయ్య తెలిపారు. కాలనీలో సుమారుగా 2 వేల గృహాలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు 550 మంది మాత్రమే సభ్యత్వం తీసుకున్నారని, మిగతా వారు కూడా 25లోగా సభ్యత్వం తీసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

### గడువు పొడిగించండి

**చైతన్యపురి:** బీసీ వర్గాలకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించే పథకం దరఖాస్తు గడువు పొడిగించాలని కోరుతూ బీజేపీ ఓబీసీ మోర్చా గడ్డిఅన్నారం అధ్యక్షుడు బొమ్మరాజు సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సరూర్‌నగర్ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు పొందేందుకు ఆలస్యం అవుతున్నందున గడువు పొడిగించాలన్నారు. అన్ని బీసీ కులాలకు ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయకులు దాసరి ప్రకాష్, పొల్కం ప్రశాంత్‌ముదిరాజ్, సురేష్‌కిరణ్, ఒంకార్, వెంకటేశ్‌చారి. మొగిలి శివరాం, రావుల శరత్, రవికుమార్ పాల్గొన్నారు.

### ధర్మన్నగూడలో బీజేపీ శ్రేణుల పర్యటన

**యాచారం:** మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో బీజేపీ శ్రేణులు మంగళవారం కాలనీ బాట పట్టారు. గ్రామంలోని పలు కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలోగా పనులు చేయకపోవడంతో గ్రామాలకు ఇచ్చిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించకపోవడంతో వెనక్కి వెళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల చేపట్టకుండా గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పుష్పాల శాంతి కుమార్, జంగమ్మ, నర్సింహ, శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మహంకాళి ఆలయ ఉత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**మహేశ్వరం:** ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహంకాళి ఆలయ జీర్ణోద్ధారణ పూర్వ మూర్తి ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ముదిరాజ్ సంఘం సభ్యులతో పాటుగా అన్ని కుల సంఘాల సభ్యులు, గ్రామస్తులు అమ్మవారి పూజలకు హాజరయ్యారు. ఈ సదర్భంగా శివగంగ రాజరాజేశ్వర ఆలయ డైరెక్టర్ చంద్రయ్య ముదిరాజ్, సర్పంచ్ ప్రియాంక రాజేశ్ దంపతులను ముదిరాజ్ సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు జంగయ్య, రాములు, ఈశ్వర్, రాజేశ్, శ్రీహరి, పరమేశ్, భిక్షపతి, శ్రీనివాస్, కుమార్, రామచంద్రయ్య, కోటయ్య, లింగయ్య, అడివయ్య, రవీందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ శివారులో పౌల్ట్రీ ఫాం వద్దు



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, గ్రామస్తులు

**తలకొండపల్లి:** గ్రామ శివారులో స్నేహ ఫౌల్ట్రీం ఫాం వేయరాదని వెల్జాల్, సంఘాయిపల్లి గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వెల్జాల్ పంచాయతీ కార్యదర్శి శరత్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధిలోని వెల్జాల్, సంఘాయిపల్లి గ్రామాల శివారు ప్రాంతంలో (కేవలం అర కిలోమీటర్ దూరంలో) స్నేహ ఫౌల్ట్రీఫాం వేయడానికి టీఎస్‌ఐపాస్ ద్వారా నిర్వాహకులు అనుమతి తీసుకున్నారు. దీంతో వారు ఫౌల్ట్రీ ఫాం నిర్మాణం చేపట్టడానికి మెటీరియల్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. ఒక కోళ్ల ఫాం నిర్మాణం చేపట్టాలంటే గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉండాలని నిబంధనలు ఉన్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మిస్తున్న ఫౌల్ట్రీ ఫాంను అడ్డుకోవాలని కార్యదర్శిని కోరారు. గ్రామానికి అతి సమీపంలో ఫౌల్ట్రీఫాం నిర్మిస్తుండటంతో చెరువులతో పాటు, పంట పొలాలు కాలుష్యమయ్యే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల శ్రేయస్సు దృష్ట్యా ఫౌల్ట్రీఫాం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రూ. లక్ష ఆర్థిక సాయం వర్తింపజేయాలి

**చైతన్యపురి:** బీసీ జాబితాలోని 130 కులాలకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఓరుగంటి వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. ఎంబీసీ కులాలకు బీసీ జాబితాలోని 14 కులాలకు మాత్రమే ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిందని, దీని వల్ల మిగిలిన కులాలకు అన్యాయం జరుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. అన్ని బీసీ కులాలలకు ఈ పథకం వర్తించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చంపాపేట బీసీ సెల్ అధ్యక్షుడు బి.గోపాల్, గౌని అనసూయ, నర్ర శ్రీనివాస్ కురుమ, కొత్తపేట అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, హస్తినాపురం అధ్యక్షుడు సత్యం చారి, నాయకులు చేకోని మల్లేష్‌గౌడ్, శివగౌడ్, గౌర శ్రీనివాస్, టిల్లు యాదవ్, రాణిగౌడ్, శ్రవణ్‌కుమార్, కనకేశ్వర్, నాగరాజు, కృష్ణసాగర్, శ్రీశైలంయాదవ్, రవీంద్రచారి, రాంచందర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ నాయకులు